సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 28 । జూలై । 2023



ఒడిశా బోర్డుల తొలగింపు

ఆంధ్రా భూభాగంలో ఏర్పాటుచేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన స్వాగతం బోర్డులను మండల అధికారులు తొలగించారు. 8లో



ఆర్థికాభివృద్ధే లక్ష్యం

కాఫీరైతుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని వెలుగు ఏపీడీ మురళి తెలిపారు. 8లో



రైతులతో కలిసి..

కొయ్యూరు: ఏఎంసీ ౖచెర్‌పర్సన్ రాజులమ్మ ఆమె స్వగ్రామం నల్లగొండలో మహిళలతో కలిసి వరి నాట్లు వేస్తూ ఉత్సాహ పరిచారు.

న్యూస్‌రీల్

3,881 ధ్రువపత్రాల పంపిణీ

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో తొమ్మిది గ్రామ సచివాలయాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ప్రత్యేక శిబిరాలు విజయవంతం అయ్యాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. 9,544 గృహాలను సందర్శించిన వలంటీర్లు వివిధ ధ్రువపత్రాల నిమిత్తం 8,978 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని ఆయన పేర్కొన్నారు. సాయంత్రానికి 3,881 ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్టు ఆయన వివరించారు. 24 దరఖాస్తులు తిరస్కరించగా, మిగిలిన ధ్రువపత్రాలను రెండు మూడు రోజుల్లో ఆయా సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ వెల్లడించారు.

నేడు రెండు చోట్ల జగనన్న సురక్ష శిబిరాలు

జగనన్న సురక్ష పథకం శిబిరాలను శుక్రవారం రంపచోడవరం మండలంలోని మేడిచర్ల, వేములకొండ సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

నిబంధనల ప్రకారం మెనూ



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

చింతూరు: ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన చింతూరులోని నర్సింహపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు తాజా ఆహార పదార్థాలు అందించాలని ఆదేశించారు. వారానికి రెండ్రోజులు చికెన్‌తో పాటు తాజా కాయగూరలు, గుడ్లు, అరటిపండ్లు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో విద్యార్థులకు దోమలు కుట్టకుండా నివారణ చర్యలు చేపట్టాలని, పాఠశాలల్లో పారిశుధ్యం పాటించేలా చూడాలని పీవో ఆదేశించారు. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వెంటనే సమీప ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం అందించాలని ఆదేశించారు.

పొంగిన గెడ్డలు

- రాకపోకలకు ఇబ్బందులు



లక్ష్మీపురం పంచాయతీ బిరిగూడ వాగులో బైకును దాటిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ కేంద్రం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంతగుమ్మి, బిర్రిగూడ, దొరగూడ, కర్లాపోదర్ గెడ్డల్లో వరద ఉధృతి నెలకొంది. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల గిరిజనులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొంతమంది గిరిజనులు నిత్యావసర సరకులకోసం ప్రాణాలకు తెగించి బిర్రిగూడ గెడ్డను దాటుకుని లక్ష్మీపురం వచ్చారు. అతికష్టంమీద బైక్‌లను మోసుకొని గెడ్డను దాటించారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామ గిరిజనులు చుట్టూ గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

మాచ్‌ఖండ్ కార్మికుల నిరసన



మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టర్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు గురువారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘాల పిలుపు మేరకు ప్రాజెక్ట్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అన్ని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెకు దిగుతామని కార్మిక సంఘం ప్రతినిధి కె.సూర్యప్రకాష్ తెలిపారు.



వీఆర్‌పురం మండలం శ్రీరామగిరిని ముంచెత్తిన వరదనీరు



చింతూరు శబరి ఒడ్డు ఇళ్లను ఖాళీ చేస్తున్న స్థానికులు



భద్రాచలం వారధి వద్ద గోదావరి వరద ఉధృతి



గౌరిదేవిపేట వద్ద నీటమునిగిన పత్తి పైరు

జల దిగ్బంధం

విలీన మండలాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువనున్న గోదావరి తగ్గుతున్నా శబరి నదికి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 93 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అప్రమత్తమైన అధికారులు ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను ముందస్తుగా ఖాళీ చేయిస్తున్నారు. నాలుగు మండలాల్లో పది వేలకు పైగా కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

- కొనసాగుతున్న వరద ఉధృతి
- గోదావరి తగ్గుముఖం.. పెరుగుతున్న శబరి
- జలదిగ్బంధంలో 93 గ్రామాలు
- విలీన మండలాల్లో సహాయక చర్యలు ముమ్మరం
- సురక్షిత ప్రాంతాలకు పది వేల కుటుంబాల తరలింపు

చింతూరు: గోదావరి, శబరి వరదలు విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. తగ్గుతూ పెరుగుతూ ఆందోళనకు గురి చేస్తున్నాయి. గోదావరికి వరద ఉధృతి తగ్గుతున్నా శబరి నదికి కొనసాగుతోంది. దీంతో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 93 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

ముందస్తుగా ఇళ్లు ఖాళీ...

అప్రమత్తమైన అధికారులు ముంపునకు గురయ్యే గ్రామాలకు చెందిన ప్రజలను ముందస్తుగానే ఖాళీ చేయిస్తున్నారు. నాలుగు మండలాల్లో పదివేలకు పైగా కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. కొన్ని గ్రామాలకు చెందిన ప్రజలు వరద భయంతో స్వయంగా తమ ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.

చుట్టుముడుతున్న వరద

వీఆర్‌పురం మండలంలో శ్రీరామగిరి, వడ్డిగూడెం, చింతరేగుపల్లి, తుమ్మిలేరు, జీడిగుప్ప, వడ్డిగూడెం కాలనీ, కూనవరం మండలంలో కూనవరం, శబరికొత్తగూడెం, కొండ్రాజుపేట గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశించింది. చింతూరు మండలంలో ఏజీకొడేరు ఒడ్డుగుంపు, చింతూరు శబరిఒడ్డు, టోల్‌గేట్ ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి.

ముంపులో రహదారులు

క్రమేపీ పెరుగుతున్న వరదనీరు రహదారులను ముంచెత్తుతోంది. చింతూరు మండలంలో చట్టి, చిడుమూరు వద్ద వరదనీరు జాతీయ రహదారి–30 పైనుండి ప్రవహిస్తుండడంతో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌కు, కుయిగూరు వద్ద జాతీయ రహదారి–326 మునగడంతో ఒడిశాకు రాకపోకలు నిలిచిపోయాయి.

- వీఆర్‌పురం మండలంలో 50, కూనవరం మండలంలో 10, ఎటపాక మండలంలో 10, చింతూరు మండలంలో 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

సహాయక చర్యలు ముమ్మరం

వరదముంపు గ్రామాల్లో అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

- ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రమాదకరంగా వున్న వాగులు దాటకుండా గ్రామ సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది కాపలాగా వుంటున్నారు.

ముంపులో నారుమడులు

ఎటపాక: ముందస్తు జాగ్రత్తగా ఎటపాక మండలంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. గన్నవరం ప్రధాన రహదారిపై నివసించే కుటుంబాలను కాపుగొంపల్లి పునరావాస కేంద్రానికి తరలించారు.

- గొల్లగూడెం, నెల్లిపాక శివారు కుటుంబాలను కూడా పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.
- లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్సఫార్మర్లను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాల్లో భద్రపరిచారు. – గౌరిదేవిపేట పీహెచ్‌సీ చుట్టూ వరద చేరటంతో మందులు,సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు ట్రాక్టర్ల సాయంతో తరలించారు.
- గౌరిదేవిపేట,తోటపల్లి,రాయనపేట తదితర గ్రామాల్లో పత్తి చేలు,వరి నారుమడులు నీటమునిగాయి. నందిగామ, మురుమూరు, గౌరిదేవిపేట, నెల్లిపాక, గన్నవరం గ్రామాల వద్ద బోట్లను అందుబాటులో ఉంచారు.

పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తం

వీఆర్‌పురం: ముంపు గ్రామాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆయా కుటుంబాలకు బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. వరద పెరుగుతున్నందున నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండలంలో 37 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా 15 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు 4,741 కుటుంబాలను అక్కడికి తరలించారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో లాంచీలు, బోట్లను సిద్ధంగా ఉంచారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

కూనవరం: వరద క్రమేపీ పెరుగుతున్నందున మండలంలోని టేకుబాక, కూనవరంలోని ఉదయ్‌భాస్కర్ కాలనీ, గిన్నెల బజారు ముంపుకు గురయ్యాయి. ఇక్కడి కుటుంబాలకు కోతులగుట్ట పునరావాస కేంద్రానికి తరలించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న కుటుంబాలకు కందిపప్పు పంపిణీ చేశారు. మండలంలో 48 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా 27 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు 5,772 కుటుంబాలను తరలించారు. వరద కారణంగా కూనవరం నుంచి చింతూరు, టేకులబోరుకు రాకపోకలు నిలిచిపోయాయి.



ఏజీకొడేరులో బాధితులను పడవపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న వరద సహాయక సిబ్బంది

అన్ని చర్యలు తీసుకుంటున్నాం



ముంపు గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆగస్టుకు సంబంధించిన రేషన్‌ను పంపిణీ చేశాం. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న కుటుంబాలకు కేజీ చొప్పున కందిపప్పు అందచేస్తాం. శుక్రవారం నుంచి వారికి కూరగాయలు కూడా పంపిణీకి చర్యలు చేపట్టాం. నాలుగు మండలాలకు వెయ్యి టార్పాలిన్లు, సోలార్‌లైట్లు అందచేయడంతో పాటు పునరావాస కేంద్రాల వద్ద 10 చేతిబోర్లు ఏర్పాటుచేశాం.

– సూరజ్ గనోరే, ఐటీడీఏ పీవో, చింతూరు



ఆంధ్రా, తెలంగాణ రహదారిపై వరదనీరు



వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



వరద వల్ల చింతూరులో నిలిచిపోయిన లారీలు

నిధులిస్తున్నా.. రోడ్లు బాగు చేయరా?



సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర

- కారుకు ఉన్న నేమ్ బోర్డు తీసి తిరిగేలా చేయొద్దు
- కొంత మంది అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు
- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట (విశాఖ): గ్రామీణ రహదారుల గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేపట్టడం లేదని అధికారులపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జరిగిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని, కొన్ని ప్రాంతాల్లో తన కారుకు ఉన్న జెడ్పీ చైర్‌పర్సన్ పేరుతో ఉన్న బోర్డును తొలగించి తిరగాల్సి వస్తోందని చెప్పారు. వడ్డాది నుంచి మన్యం వరకు ఘాట్ రోడ్డు గుంతలతో నిండిపోయిందన్నారు. వారంలో రెండు రోజుల పాటు ఈ మార్గంలో తాను తిరుగుతున్నట్టు చెప్పారు. రోడ్ల సమస్యను అనకాపల్లి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే నెల 19న జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశం లోగా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు.జిల్లాలో జరిగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సమయంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు అందుతున్నాయని జె.సుభద్ర తెలిపారు. ఇటీవల తనను పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల జెడ్పీ కార్యాలయ ఉద్యోగికి గుండెనొప్పి రావడంతో కేజీహెచ్‌లో చేరారని, వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ఆయన పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలలకు భవనాల నిర్మాణంతో పాటు భాషా పండితులను నియమించాలని సుభద్ర కోరారు. దీనిపై డీఈవో చంద్రకళ స్పందిస్తూ 940 పాఠశాలలకు భవనాలు నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వ అనుమతి కోసం పంపామన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు కండ్ల కలకతో ఇబ్బంది పడుతున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. 5వ సంఘ చైర్మన్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం లేదా ఐటీడీఏ నిధులతో గానీ మండలాల్లో అసంపూర్తిగా ఉన్న వివిధ భవనాలను పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు, మూడు జిల్లాల అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అరకు ఎమ్మెల్యే మానవత్వం

పిడుగుపాటు మృతుని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మానవత్వం చూపారు. పోషించే దిక్కును కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న పిడుగుపాటు మృతుని కుటుంబానికి బాసటగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో మాదల పంచాయితీ బొర్రిగూడ గ్రామానికి చెందిన పశువుల కాపరి గుబాయి రాజు ఈనెల 26న పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. దీంతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్న రాజు మృతదేహాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఆఖరి ప్రయాణ రథంలో మృతదేహాన్ని స్వగ్రామం బొర్రిగూడ తరలించేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఆ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే పాల్గుణ బాధిత కుటుంబానికి రూ.50 వేల నగదు అందజేశారు. ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల పరిహారం అందేలా తమ వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పిడుగుపాటుకు మృతి చెందిన నాలుగు పశువులకు బీమా అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గాసి, ఎంపీటీసీ రాంచందర్ పాల్గొన్నారు.

వరద బాధితుల రక్షణే లక్ష్యం

- ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చర్యలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: ప్రస్తుత వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా వరదబాధితులకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఉదయం ముంపు మండలాలపై నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రానున్న రెండురోజులు కీలకంగా భావించాలని సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి 53 నుంచి 55 అడుగుల వరకు చేరుకునే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయి బృందాలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. గర్భిణుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ముంపు మండలాల్లో తహసీల్దార్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో పడవలు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్‌సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, డీజిల్, టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద తాగునీరు, జనరేటర్ సిద్ధం చేయాలన్నారు. వైద్యశిబిరాలు నిర్వహించాలని, స్టాఫ్‌నర్స్‌లు రాత్రి సమయంలో కూడా అందుబాటులో ఉండాలని, అవసరమైతే మందులు నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. ముంపు గ్రామాల్లో బోట్లు తిరిగేందుకు అనుకూలంగా విద్యుత్ సరఫరాను పగటి సమయంలో నిలిపివేసి, రాత్రి సమయంలో పునరుద్ధరించాలని ఆదేశించారు.

విద్యుత్ సిబ్బంది నంబర్లను అందరికీ తెలిసేవిధంగా ప్రకటించాలన్నారు. వరద ప్రభావంతో మూసివేసిన రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రించాలని సూచించారు. చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్‌గనోరే, ఏఎస్పీ రాహుల్, డీఎం అండ్‌హెచ్‌వో జమాల్‌బాషా, కూనవరం, చింతూరు, ఏటపాక, వీఆర్.పురం తహసీల్దార్లు, ఆయా మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కూనవరం, ఏటపాక ఆయా సబ్‌సెక్షన్ పరిధిలో జేఈ, ఏఈ, లైన్‌మెన్లకు ప్రత్యేక విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏవోబీలో రెడ్ అలెర్ట్

మావోయిస్టు పార్టీ అమర వీరుల వారోత్సవాలు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు జరగనున్న నేపథ్యంలో ఏవోబీతోపాటు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలోను పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. అణువణువూ గాలింపు చేపట్టాయి. వారోత్సవాలు, సంస్మరణ సభల నిర్వహణపై మావోయిస్టు కీలక నేతలు కటకం సుదర్శన్, ఎల్ఎస్ఎన్ మూర్తి, సుంద్రి, మంగో, ఉమేష్ ఫొటోలతో ఆంధ్రా, ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరిట ఇటీవల ప్రకటన విడుదలైంది. దీంతో పోలీసుశాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది.

- నేటి నుంచి మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- కూంబింగ్ విస్తృతం
- డ్రోన్ కెమెరాలతో నిఘా



మావోయిస్టు పార్టీ కీలక నేతల ఫొటోలతో విడుదల చేసిన అమర వీరుల వారోత్సవాల కరపత్రం



ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మోహరించిన పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు: ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాలతో పాటు,చింతూరుకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్, జిల్లాలోని పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో పోలీసుశాఖ భద్రత చర్యలను విస్తృతం చేసింది. చింతూరుకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్, ఏవోబీ ప్రాంతాలను రెండు స్టేజ్‌లుగా విభజించి బలగాలను అప్రమత్తం చేశారు. కేంద్ర హోంశాఖ,ఇంటిలిజెన్స్ విభాగాలు తెలంగాణ,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుఅప్రమత్తం చేయడంతో దండకారణ్యంలో పోలీసు బలగాలు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. కేంద్ర బలగాలు అడవిలో జల్లెడ పడుతున్నాయి. పోలీసు అవుట్ పోస్టులు,పోలీసు స్టేషన్ల పరిధిలోను రెడ్ అలెర్ట్ అమలు చేస్తున్నారు.

వర్షాలు కురుస్తున్నా..

సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఇతర పోలీసు బలగాలను అదనంగా రంగంలోకి దింపారు.అవుట్ పోస్టులలో ప్రత్యేక బలగాలు మకాం వేసి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో రోజువారీ కూంబింగ్ చర్యల్లో నిమగ్నమయ్యాయి.ఓ వైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ పోలీసు పార్టీలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కూంబింగ్ పార్టీలకు తోడుగా డ్రోన్ కెమెరాలతో పాటు బాంబుస్క్వాడ్‌లు కూడా చురుగ్గా పనిచేస్తున్నాయి. ప్రధాన సెంటర్లలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

ప్రజాప్రతినిధులను అప్రమత్తం

ప్రజాప్రతినిధులు, హిట్ లిస్ట్‌లో ఉన్న నేతలను భద్రత కల్పించే దిశగా పోలీసుశాఖ అప్రమత్తం చేసింది. ఈ మేరకు నోటీసులు అందజేసింది. మావోయిస్టుల వారోత్సవాలు ముగిసేంత వరకు మారుమూల ప్రాంతాల పర్యటనలకు వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పోలీసుశాఖ తగిన హెచ్చరికలు జారీ చేసింది. అనుమానిత వ్యక్తుల సంచారంపై కూడా ప్రజాప్రతినిధులు, ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరింది.

మారుమూల ప్రాంతాలకు బస్సుల నిలిపివేత

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నిలిపివేతతో పాటు నైట్‌హాల్ట్ సర్వీసులను గురువారం నుంచి ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ అధికారుల రద్దు చేశారు. కొన్ని ఆర్టీసీ సర్వీసులను మండల కేంద్రాల వరకు నడపనున్నారు.

వారోత్సవాలను అడ్డుకుంటాం



మావోయిస్టుల ప్రాబల్యం తక్కువగా ఉన్నప్పటికీ వారు తలపెట్టిన అమర వీరుల వారోత్సవాలను అడ్డుకుంటాం. ప్రజలంతా అభివృద్ధిని కోరుకుంటున్నారు. మావోయిస్టుల పట్ల వారంతా వ్యతిరేకంగానే ఉన్నారు. వారోత్సవాలతో ప్రజలకు ఒరిగిందేమి లేదు. ఏవోబీ అంతా రెడ్ అలర్ట్‌ను అమలుజేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, హిట్ లిస్ట్‌లో ఉన్న నేతలకు భద్రత కల్పిస్తున్నాం.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, పాడేరు

క్లుప్తంగా

ఒడిశా బోర్డుల తొలగింపు

ముంచంగిపుట్టు: ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు జలాశయం సమీపంలో ఏర్పాటుచేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన స్వాగతం బోర్డులను మండల అధికారులు తొలగించారు. ఆంధ్రా భూభాగంలో స్వాగతం బోర్డులు ఏర్పాటు చర్చనీయాంశంగా మారడంతో జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో ఎంపీడీవో రమేష్, తహశీల్దార్ నర్సమ్మ, జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రవీంద్ర, సర్పంచులు నీలకంఠం, గంగాధర్ గురువారం జోలాపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లి ఒడిశా అధికారులతో మాట్లాడారు. ఆంధ్ర భూ భాగంలో ఒడిశా బోర్డుల ఏర్పాటుపై చర్చించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన బోర్డులను వెంటనే తొలగించాలని వారు సూచించారు. ఒడిశా అధికారుల సమక్షంలో బోర్డులు తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఏఎస్ఐ తిరుపతిరావు, వీఆర్వో మోహన్, సర్వేయర్ సుజాత పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

కొయ్యూరు/పెదబయలు/జి.మాడుగుల: మావోయిస్టులకు వ్యతిరేకంగా కొయ్యూరు మండలంలో రాజేంద్రపాలెం, కొయ్యూరు, గుడ్లపల్లి, మంప, రేవళ్లు, బూదరాళ్ల, పెదబయలు మండలం సీతగుంట, పెదబయలు. బొంగరం, ఇంజరి, జి.మాడుగుల మండలం మద్దిగరువు, నుర్మతి, జి.మాడుగుల ప్రాంతాల్లో అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరిట కరపత్రాలు వెలిశాయి. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, ఈ నేపథ్యంలో వారోత్సవాలు వద్దని, సెల్ టవర్లను పేల్చి గిరిజన యువతకు అందుతున్న ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారని, రోడ్లు రాకుండా అడ్డుకుని అభివృద్ధిని దూరం చేస్తున్నారని వాటిలో పేర్కొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పాడేరు-జి.మాడుగుల,చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు రోడ్డు మార్గాల్లోని కల్వర్టు, బ్రిడ్జిలు, అనుమానిత ప్రాంతాల్లో గురువారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నుర్మతి రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, పాడేరు రోడ్డు మార్గంలో మత్స్యపురం జంక్షన్ వద్ద ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.

జగనన్న సురక్షతో చెంతకే సేవలు



సలుగులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ప్రజాప్రతినిధులు

పాడేరు రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత సేవలను ప్రభుత్వం గడప వద్దకే తీసుకువచ్చి ప్రజలకు ఎంతో మేలు చేసిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మారుమూల సలుగు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం పరిధిలో వివిధ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 1169 మందిలో గురువారం 518 మందికి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అర్హులందరికీ ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం తలపెట్టిందన్నారు. లబ్ధిదారులకు ఒక్కరోజులోనే ధ్రువపత్రాలు మంజూరవడం హర్షణీయమన్నారు. గత టీడీపీ హయాంలో ఏదైనా ధ్రువపత్రం పొందాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ముంగిటకే అన్ని సేవలందిస్తోందన్నారు. ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా ఒక్కరోజులోనే ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేయడం ఓ చరిత్ర అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇటువంటి వినూత్నమైన కార్యక్రమం తలపెట్టలేదన్నారు. జగనన్న సురక్షా కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి ఎంతో మేలు జరిగిందన్నారు. సర్పంచ్‌లు గెమ్మెలి అప్పలకొండ, వంతాల రాంబాబు, కిల్లు పరమేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎంపీటీసీలు చిప్పాడ మీనా, లకే రామకృష్ణపాత్రుడు, మాజీ ఎంపీపీ మంగ్లన్నదొర, తహసీల్దార్ వంజంగి త్రినాథ్‌నాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు

అరకులోయ రూరల్: జగనన్న సురక్షతో ప్రజలకు మరింత మేలు జరుగుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని పద్మపురం పంచాయతీ సచివాలయం-2 యండపల్లివలస, మాడగడ పంచాయతీ సచివాలయం-2 చంపగూడ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

ఇప్పటికే మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 7132 దరఖాస్తులకు గాను 6552 పరిష్కరించినట్టు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్ శర్మ మాట్లాడుతూ అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా జగనన్న సురక్ష తదితర కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, సర్పంచ్‌లు జ్యోతి, సుస్మిత, ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గాసి, వైస్ సర్పంచ్ భగత్‌రాం, నాయకులు సాంబ, యాసీన్, సుంద్ర, గోపాల్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన అంగన్‌వాడీ భవనాల పూర్తి

వచ్చే నెల 15లో పూర్తి చేయాలని పీవో అభిషేక్ ఆదేశం



మినుములూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలుచోట్ల నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని మినుములూరు, పి.గొందూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాలను పరిశీలించారు. భవన నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఫ్లోరింగ్‌కు నాణ్యమైన టైల్స్ వాడాలన్నారు. అనంతరం కోడిగుడ్లు గ్రామంలో రూ.40 లక్షల సీసీడీపీ నిధులతో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. త్వరితగతిన గడువులోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ అనుదీప్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, మినుములూరు సర్పంచ్ లంకెల చిట్టమ్మ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల లొంగుబాటు

రిమాండ్‌కు తరలింపు



హత్య కేసు నిందితుడితో సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్

అరకులోయటౌన్: హత్య కేసులో నిందితుడు పాంగి రాజు (43) మంగళవారం అరకులోయ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సీహెచ్.రుద్రశేఖర్ ఎదుట లొంగిపోయాడు. సీఐ అందించిన వివరాలివి. మండలంలోని బస్కీ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి చెందిన పాంగి రాజు తన భార్యతో తరచూ గొడవలు పడేవాడు. గ్రామంలోని ప్రజలతో కూడా తరచూ గొడవలు పడేవాడు. ఈనెల 25వ తేదీన నిందితుడు పాంగి రాజు తన భార్యతో గొడవలు పడుతుండగా తన ఇంటి ఎదుట నివాసం ఉంటున్న పాంగి కొములు (76) కలుగజేసుకొని ఎందుకు చీటికి మాటికి నీ భార్యతో గొడవలు పడుతుంటావని వారించాడు. దీనిని మనసులో పెట్టుకొని అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో వరండాలో పడుకున్న పాంగి కొములును సమీపంలోని కమ్మరశాల వద్దకు తీసుకువెళ్లి మెడ పట్టుకొని భూమిపై గట్టిగా అన్చి ఉంచడంతో కొములు అక్కడికక్కడే చనిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, అంతలో నిందితుడు రాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో అరకులోయ ఎస్ఐ ఆర్. సంతోష్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు సొంతిళ్లు

- లంకవీధిలో స్థలాన్ని పరిశీలించనున్న క్షత్రియ పరిషత్ సభ్యులు
- త్వరలో నిర్మాణాలు చేపడతామని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు వెల్లడి



స్థలాన్ని పరిశీలిస్తున్న క్షత్రియ పరిషత్ సభ్యులు, సూర్యనారాయణరాజు తదితరులు

కొయ్యూరు: స్వాంతంత్య్ర సమరయోధుల మునిమనమళ్లకు సొంత ఇంటి కల సాకారం కాబోతోంది. క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం లంకవీధిలో ఇళ్లు నిర్మించనున్న ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పరిశీలించారు. అల్లూరితో కలిసి పోరాటం చేసిన గాం గంటన్న, మల్లుదొర కుటుంబాలకు చెందిన 11 మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవి విజ్ఞప్తి మేరకు క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నాగార్జున నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ కన్సల్టెంట్ ఎంపీ రాజు, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు ఇళ్లు నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. క్షత్రియ పరిషత్ సభ్యులు బంగారు రాజు, ప్రదీప్‌వర్మ, నడింపల్లి నానిరాజు, చక్రపాని రాజు, నాగేంద్రరాజు, ఎంపీటీసీ మల్లేశ్వరి, సర్పంచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు



జోలాపుట్టులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముంచంగిపుట్టు నుంచి బాపనపుట్టు, కర్రిముఖిపుట్టు గ్రామాల వరకు కల్వర్టులు, వంతెనలను బాంబు స్క్వాడ్‌తో పరిశీలించారు.సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకడిల్లీలో బీఎస్ఎఫ్ బలగాలు ఏవోబీలో రాకపోకలపై నిఘా పెంచాయి.

గంజాయితో ముగ్గురు అరెస్టు

అరకులోయ టౌన్ : అరకులోయ పోలీసులు గురువారం 22 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. సీఐ రుద్రశేఖర్ అందించిన వివరాలివి. ముందస్తు సమాచారంతో ఎస్ఐ ఆర్.సంతోష్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా 22 కిలోల గంజాయితో న్యూఢిల్లీకి చెందిన శివకుమార్(61), పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ (34), తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డికి చెందిన ఎస్.రమేష్(21) అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరంతా అరకులోయ పరిసరాల్లో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీలో చేరవేసేందుకు వచ్చినట్టు విచారణలో తేలిందన్నారు. వారిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్ తరలిస్తామన్నారు. ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- వెలుగు పీడీ మురళి

అనంతగిరి: సంప్రదాయమైన పరిశ్రమల పునరుత్పత్తి నిధుల పథకం ద్వారా కాఫీ రైతులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం సహకారం అందిస్తోందని ఏపీడీ మురళి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని గురువారం స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా పది పంచాయతీలకు చెందిన 973 మంది కాఫీ మహిళా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్ఫూర్తి ప్రాజెక్టులో కాఫీ రైతులు సేకరించిన కాఫీ గింజలను పౌడర్‌గా తయారుచేసి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తూ ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఎమ్ఈ డైరెక్టర్ శ్రీను, ఏపీఎం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

కాలుజారి పడి కార్మికుడి మృతి



మెహబూబ్ అలీ (ఫైల్)

రాంబిల్లి: యునిపార్క్స్ కంపెనీలో గురువారం రేకుల షెడ్డు వేస్తుండగా ఎండీ మెహబూబ్ అలీ(34) ప్రమాదవశాత్తూ కాలిజారి పడిపోయి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తోటి కార్మికులతో కలిసి మెహబూబ్ అలీ పాత రేకులు తీసి కొత్త రేకులు వేస్తుండగా కాలిజారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అలీని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కూర్మన్నపాలెం సమీపంలో గల ఇస్లాంపేటకు చెందిన మెహబూబ్ అలీకి భార్య, ఒక బాబు ఉన్నారు. కాగా మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కలప అక్రమ రవాణాపై రూ.2.65 లక్షల జరిమానా

దేవరాపల్లి : టేకు కలపను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి రూ.2.65 లక్షల అపరాధ రుసుము విధించినట్టు చోడవరం రేంజర్ ఇ.వి.వర్మ తెలిపారు. చెక్ పోస్టు వద్ద బుధవారం రాత్రి రెండు వాహనాలతో పట్టుబడిన కలపను తన సిబ్బంది సహకారంతో గురువారం లెక్కించారు. అనంతగిరి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న 104 టేకు దుంగలను స్వాధీనం చేసుకుకొని, కేసు నమోదు చేసి, రెండు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.

చేతబడి నెపంతోనే హత్య

- గిరిజన మహిళ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు
- సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం పూర్తి



సంఘటన స్థలంలో వెలికితీసిన బున్నమ్మ మృతదేహం



బున్నమ్మ (ఫైల్)

మారేడుమిల్లి : చేతబడి చేస్తుందనే నెపంతో చావడికోట పంచాయతీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన పల్లాల బున్నమ్మ (53) అనే గిరిజన మహిళను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాడుతో గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని అడవి ప్రాంతంలో పూడ్చి పెట్టారు. గత ఆదివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. గురువారం స్థానిక సీఐ రమేష్, మారేడుమిల్లి, గుర్తేడు ఎస్ఐలు రాము, జ్వాలసాగర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశాన్ని గుర్తించి బయటకు తీశారు. అప్పటికే ఐదు రోజులు కావడంతో మృతదేహం పాడైపోయి దుర్వాసన వస్తుంది. ఎమ్మార్వో శ్రీనివాసరావు సమక్షంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రి వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాలు ప్రకారం బంధ గ్రామానికి చెందిన సాదల రామిరెడ్డి, నీలపు రెడ్డి, బొర్రం రెడ్డి ముగ్గురు వ్యక్తులు అన్నదమ్ముళ్లు. వీరికి మృతురాలు పల్లాల బున్నమ్మ వరుసకు అక్క అవుతుంది. రామిరెడ్డి భార్య సాదల అమ్మయమ్మ రెండేళ్లుగా బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఆమెను భర్త ఓ భూత వైద్యుడికి చూపించగా చేతబడి చేశారని చెప్పడంతో బున్నమ్మే చేతబడి చేసి ఉంటుందనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులు కలిసి బున్నమ్మను హత్య చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భవనాలు వేగవంతం



సమీక్షా నిర్వహిస్తున్న పీఆర్ డీఈ సత్యనారాయణమూర్తి

రాజవొమ్మంగి: మండలంలో ఇప్పటికే మంజూరైన సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్ నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈ సత్యనారాయణమూర్తి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా భవనాలకు చెందిన బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నామని, పెండింగ్ లేవన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత సిబ్బంది, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 8 సచివాలయాలు, 8 ఆర్బీకేలు, 4 వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వివిధ దశల్లో ఉన్న వీటి నిర్మాణాలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యధోరణిని అవలంభిస్తున్న మండలంలోని శరభవరం, కింద్ర, లబ్బర్తి కాంట్రాక్టర్లను తొలగించి వేరే వారికి అవకాశం కల్పించామన్నారు. రంపచోడవరం డివిజన్‌లో 53 సచివాలయాలు, 52 రైతు భరోసా కేంద్రాలు, 38 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 5 సచివాలయాలు, 4 ఆర్బీకేల నిర్మాణం మాత్రమే పూర్తయినట్టు డీఈ తెలిపారు. వీటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఏఈ రవితేజ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా వై.వి.సుబ్బారెడ్డి నియామకంపై హర్షం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రామ్‌దాస్, రఘునాథ్

అరకులోయటౌన్: అరకులోయ వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా వై.వి.సుబ్బారెడ్డి నియామకంపై నాయకులు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ కిరసాని రామ్‌దాస్ హర్షం వ్యక్తం చేస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరకులోయలోని నాలుగురోడ్ల జంక్షన్ వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌దాస్ మాట్లా డుతూ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని అరకులోయ, పాడేరు ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అరకులోయలో పార్టీ మరింత బలోపేతం కోసం సమష్టిగా ప్రతీ ఒక్కరు పని చేయాలని కోరారు. నాయకులు రఘునాథ్, పరశురామ్, కొములు నాయుడు, రామరావు, అమ్మన్న పాల్గొన్నారు.